క్లుప్తంగా

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



వేటపాలెం: దేవాంగ కార్పొరేషన్ చైర్మన్‌గా తిరిగి రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర శనివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. సీఎం తనపై నమ్మకం ఉంచి మరోసారి అవకాశం కల్పించినందుకు రుణపడి ఉంటామన్నారు. రాష్ట్రంలోని దేవాంగ ప్రజల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు, వివిధ జిల్లాల దేవాంగ సంఘాల పెద్దలు సురేంద్రను అభినందించారు.

రీ సర్వేతో భూసమస్యలకు పరిష్కారం



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో సరోజిని

జే.పంగులూరు: రీ సర్వేతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని చీరాల ఆర్డీవో సరోజిని పేర్కొన్నారు. శనివారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో పరిశీలించారు. కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మండలంలోని అలవపాడు, తూర్పుకొప్పెరపాడు, చందలూరు గ్రామాల్లో ప్రస్తుతం రీ సర్వే జరుగుతున్నట్లు చీరాల ఆర్డీవో సరోజిని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐ. పద్మావతి, ఆర్ఐ రామక్రిష్ణ అధికారులు ఉన్నారు.

కేవీపాలెంలో ముగిసిన క్రికెట్ పోటీలు



మొదటి బహుమతి కైవసం చేసుకున్న కేవీపాలెం టీమ్

బల్లికురవ: సంక్రాంతి సందర్భంగా మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా క్రికెట్ పోటీలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. జిల్లాలోని నలుమూలలనుంచి 56 టీమ్‌లు ఎంట్రీలు సమర్పించగా మొదటి బహుమతిని కేవీపాలెం యూత్ రూ.30,116, షీల్డ్, రెండో బహుమతి రూ. 20,116 కేవీపాలెం లెవెన్ కిల్లర్స్, మూడో బహుమతి రూ. 10,116ను మక్కెనవారిపాలెం టీమ్ కైవసం చేసుకుంది. 15 రోజులుగా నువ్వా నేనా అన్నట్లు జరుగుతున్న క్రికెట్ పోటీలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఉపాధ్యాయులకు ప్రణాళిక తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో సత్యన్నారాయణ

కారంచేడు: విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయుల బోధించాలంటే సరైన ప్రణాళికను రూపొందించుకోవాలని ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం కారంచేడు ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. యూపీ పాఠశాల కావడంతో ఆయన సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల బోధన, పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ప్రతి విద్యార్థికి తరగతులు సులభతరంగా అర్థమయ్యేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి టీఎల్ఎంల సహకారంతో విద్యాబోధనలు చెయ్యాలన్నారు. అప్పుడే విద్యార్థులు నేర్చుకున్న వాటిని మరిచిపోకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సాబీరున్నీసా, గుత్తా శ్రీనివాసరావు, తారాజ్యోతి, ఉపాధ్యాయులు, కుంకింగ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

చివరి భూముల వరకు సాగునీరు



లక్కవరం వద్ద సాగర్ కాలువను పరిశీలిస్తున్న ఆమంచి



కోటపాడు మేజర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కృష్ణమోహన్

- పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

మార్టూరు: సాగర్ కాలువ ద్వారా చివరి భూముల రైతుల పంటల వరకు సమృద్ధిగా అందేలా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. మండల పరిధిలోని సాగర్ కాలువపై శనివారం రైతులు, అధికారులు కలిసి విస్తృతంగా పర్యటించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడారు. మొదటిసారి కాలువను పరిశీలించిన ఆమంచికి ఎన్ఎస్‌పీ కెనాల్ డీఈ స్వామి నీటి పారుదల వివరాలు తెలిపారు. లక్కవరం గ్రామం వద్దగల 37 లాకుల వద్ద ప్రస్తుతం 490 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నాయని, కోటపాడు మేజరుకు 220 క్యూసెక్కులు, నూతలపాడు మైనరుకు 180 క్యూసెక్కులు, సమీప గ్రామాలకు 90 క్యూసెక్కుల నీటి సరఫరా చేస్తున్నట్లు డీఈ తెలిపారు.

వారబందీలో భాగంగా సోమవారం నుంచి పమిడి పాడు మేజరుకు, ద్రోణాదులకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ సాగర్ జలాల పట్ల పూర్తి అవగాహన చేసుకుని నూతలపాడు మైనర్ పరిధిలోని నాగులపాలెం, ఆదిపూడి, ఉప్పుటూరు, వీరన్నపాలెం కాలువ చివరి భూముల వరకు రైతులకు నీటి సరఫరా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

స్థానిక రైతులు, నాయకులను అడిగి సమస్యల గురించి తెలుసుకున్నారు. కోటపాడు, కోలలపూడి, చిమ్మిరిబండ, ద్రోణాదుల, పూనూరు గ్రామాల్లో సాగర్ కాలువను పరిశీలించి నూతలపాడు వెళ్లారు. కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈలు బాలకృష్ణ, సుబ్బారావు, రాజేష్ ఇతర సిబ్బందితో పాటు మార్టూరు, యద్దనపూడి మండలాల రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వృద్ధుడితో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మళ్లీ ముఖ్యమంత్రి జగనన్నే

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

అద్దంకి: మళ్లీమళ్లీ రాష్ట్రానికి సీఎంగా జగన్ మోహన్ రెడ్డిని చేసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శనివారం పట్టణంలోని ఒకటో వార్డులో కౌన్సిలర్ బాలుతో కలసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఆయా లబ్ధిదారులకు చేకూరిన కరపత్రాలు పంపిణీ చేశారు. యువకులు, వృద్ధులను పరామర్శిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేశామని, ఇప్పటికే కొన్ని పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. అదే తరహాల్లో పట్టణంలోనూ పనులు చేయిస్తున్నామన్నారు. అధినాయకుడు సీఎం జగన్ చెప్పిన విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. వైఎస్సార్ సీపీ పాలనకు ఆకర్షితులై పార్టీలోకి వచ్చే వారిని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఎవరు ఏమి చెప్పినా అధినేత చెప్పిన విధంగా పాత, కొత్త నాయకులు అందరూ కలిసి పని చేసుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు.

విభేదాలు వీడి అందరూ ఒక్కటే కలిసి ముందుకు సాగాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్లు దేశుపద్మేశ్, కే అంనతలక్ష్మి, పట్టణ పార్టీ నాయకులు కాకాని రాధాకృష్ణమూర్తి, నాయకులు సందిరెడ్డి రమేశ్, కౌన్సిలర్లు, వలంటీర్లు, అధికారులు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంద శాతం ఇళ్ల నిర్మాణాలు జరగాలి

జే.పంగులూరు: జగనన్న కాలనీలోని లే ఔట్లలో 100 శాతం ఇళ్ల నిర్మాణాలు జరగాలని, అందరూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ జేవీఎస్ఆర్‌సీ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలో శనివారం జగన్న కాలనీలను ప్రత్యేకాధికారి జేవీఎస్ఆర్‌సీ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఉగాదినాటికి మండలంలో 347 గృహాలు పూర్తి చేయాలన్నారు. అందులో భాగంగా వెలుగు కార్యాలయం నుంచి లబ్ధిదారులకు పునాదులు వేసుకునేందుకు రూ. 35 వేలు రుణ మంజూరు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి, హౌసింగ్ జేఈ కిషోర్, ఏపీవో జ్యోతుల ప్రసాద్, ఏపీవో లక్ష్మిదేవి, సర్పంచ్ సాంబశివరావు, ఎంపీటీసీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు చేపట్టిని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని మెప్మా పీడీ టీ రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఆర్పీలకు, సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మెప్మా అధికారి ఫణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: మండలంలోని జగనన్న లే అవుట్‌లోని గృహ నిర్మాణాల లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ మండల ప్రత్యేకాధికారి జాలిరెడ్డి సూచించారు. శనివారం ఆయన మండలంలోని చినగంజాం, కొత్తపాలెం పంచాయతీల పరిధిలోని జగనన్న లే అవుట్లను సందర్శించి నిర్మాణంలో ఉన్న గృహాల ప్రగతి గురించి సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ కే స్వరూపరాణి, ఏపీవో కే సంతోషం, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, టీ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

యద్దనపూడి: జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలు చేపట్టకపోతే సంబంధిత ఖాళీ ప్లాట్లను రద్దు చేసి అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని ఎంపీడీవో కృష్ణకుమారి అన్నారు. శనివారం మండలంలోని పూనూరు, యనమదల, సూరవరపుపల్లి, గన్నవరం, చిమటవారిపాలెం గ్రామాల్లో జగనన్న లేవుట్లను తహసీల్దార్ వెంకటరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సాంబశివరావులు సందర్శించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరత్తమ్మ, ఏపీఎం వెంకట్రావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



చినగంజాం: సిబ్బందికి సూచనలిస్తున్న జెడ్పీ సీఈవో

23 నుంచి ఆమంచి పర్యటన

మార్టూరు: పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ఈ నెల 23 నుంచి మండల కేంద్రం మార్టూరులో పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గ్రామాల నాయకులను కలిసి ఆయా గ్రామాల అభివృద్ధిపై చర్చిస్తారని నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కాలేషావలి పిలుపునిచ్చారు.

తవ్వకాలు ఆపాలంటూ ర్యాలీ

మార్టూరు: తమ గ్రామంలోని కొండపై జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలు నిలిపివేసి పర్యావరణ పరిరక్షణకు అధికారులు సహకరించాలంటూ మండలంలోని కోలలపూడి గ్రామస్తులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. కొండపై లోతుగా తవ్విన గుంతల్లో పడి పశువులు చనిపోతున్నాయని టిప్పర్ల వల్ల నివాసాలు ధ్వంసం అవుతున్నాయని, కొండ అంతరించిపోతే పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందంటూ గ్రామస్తులు స్వచ్ఛందంగా వీధుల వెంట ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వెంకట శివరామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

విశ్వ బ్రాహ్మణ వంశోద్ధారకుడు గానాల

అద్దంకి రూరల్: విశ్వబ్రాహ్మణ జాతి వంశోద్ధారకుడు గానాల రామ్మూర్తి అని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి అన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్సీ గానాల రామ్మూర్తి 132 జయంతి వేడుకలను అద్దంకిలోని ఆ సంఘ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో గానాల రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మునగ నరసింహచారి, అద్దంకి కమలేశ్వర్వస్వామి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ అనంతు మురళీ రామ్మోహన్‌రావు, వీరబ్రహ్మేంద్రస్వామిదేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరకొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: విశ్వబ్రాహ్మణ జాతి అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన గానాల రామ్మూర్తి 132వ జయంతిని శనివారం చీరాలలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం, చీరాల–పేరాల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొర్రెపాటి ప్రభాకర్, కడలి జగదీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఇంకొల్లు వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో గానాల విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విశ్వబ్రాహణ సంఘ నాయకులు

జే.పంగులూరు: జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటాపురం చారి ఆధ్వర్యంలో ముప్పవరం గ్రామంలో మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గానాల రామమూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అతిథి జిల్లా ప్రధాన కార్యదర్శి చేబ్రోలు రవీంద్రాచారి, టీ రామకృష్ణ వర్కింగ్ ప్రసిడెంట్ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మహనీయుడు పురంధరదాసు

అద్దంకి: సంగీత మాధ్యమంతో సమాజానికి తత్వ ప్రబోధ చేసిన మహనీయుడు పురందరదాసు అని జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పురందరదాసు విగ్రహం వద్ద పురంధరదాసు ఆరధానోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కన్నడ పద కవితా పితామహుడిగా పేరుగాంచిన పురందరదాసు 75 వేల కీర్తనలను రచించారని చెప్పారు. తరువాత విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ ఆర్జేడీ యూ దేవపాలన, హిందీ పండిట్ ధర్మవరపు శ్రావణ్‌కుమార్, కోలాటం మాస్టార్ జాష్టి వెంకటేశ్వర్లు, చెన్నుపాటి రామాంజనేయులు, గాడేపల్లి దివాకరదత్తు, వారణాశి రఘురామశర్మ పురందరదాసు గురించి ప్రసగించారు. విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో జ్యోతి రమేశ్, వాసవి వనిత క్లబ్ గవర్నర్ వూటుకూరు ఉమా అన్నపూర్ణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, భజన పంతులు షేక్ జాన్ బాషా, సైదావలి, అంజాద్‌బాషా, మాదాల దానయ్య, వెంకటాద్రి, పుట్టా వీరాంజనేయులు, సీహెచ్ పవన్ తదితర సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాగేశ్వరరావు

పట్టణాభివృద్ధికి మరింత ప్రాధాన్యత

- అజెండాలోని అంశాలన్నీ ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ జంజనం, సభ్యులు

చీరాల: పట్టణ అభివృద్ధి మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముందుగా అజెండాలోని 24 అంశాలపై చర్చ నిర్వహించారు. కౌన్సిల్ సభ్యుల అందరి ఆమోదంతో అజెండాలోని అంశాలన్నింటిని కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ పరిధిలోని జరగనున్న పలు అభివృద్ధి పనులు వెంటనే అమలు జరిగేలా చూడాలన్నారు. అలానే పట్టణంలోని జగనన్న మహిళా మార్ట్‌కు సంబంధించిన మరమ్మతుల పనులు, మురుగు కాలువలు, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పైపులైన్లు, ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులను వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం

అద్దంకి: జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం జరిగేలా పోలీసు అధికారులు చొరవ చూపాలని సీనియర్ సివిల్ జడ్జి బాబూనాయక్ అన్నారు. రాజీ మార్గమే రాజమార్గమని చెప్పారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులకు అప్పీలు ఉండదన్నారు. కోర్టులో శనివారం ఆయన పోలీసులతో ఫిబ్రవరి 11న నిర్వహించనున్న అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ కేసులు పెట్టుకున్న ఇరువర్గాల వారితో మాట్లాడి సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు రాజీ చేసుకునేలా చూడాలని కోరారు. స్టేషన్‌లో దీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని చెప్పారు. అదాలత్ కోసం ప్రతి స్టేషన్‌కు ఏఎస్సై హోదాలో ఉన్న ఒక నోడల్ అధికారిని నియమించామని చెప్పారు. సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ ఎస్ ప్రియదర్శిని, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చినగంజాం: జిల్లాలో జనవరి 22 వతేదీ ఆదివారం నిర్వహించనున్న కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ తెలిపారు. బాపట్ల జిల్లాలో మొత్తం 15 పరీక్ష కేంద్రాల్లో 8567 మంది అభ్యర్థులు పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు హాజరవుతున్నారని, అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారన్నారు. ఉదయం 10 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోనికి అభ్యర్థులు అనుమతించరని ఆయన పేర్కొన్నారు. ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల్లో పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు.

గొలుసు చోరీపై కేసు

చీరాల: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీపై ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన ఎస్.తులసమ్మ అనే వృద్ధురాలు గురువారం రాత్రి ఇంటి నుంచి షాపుకు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కాగా వృద్ధురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు శనివారం కేసు నమోదు చేశారు.

వ్యక్తి మృతి కేసులో ఇద్దరు అరెస్టు

చీరాల: వ్యక్తిపై దాడి చేసి గాయపరచి అతని మృతికి కారణమైన ఇరువురిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సోమశేఖర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పి.రామకృష్ణారెడ్డి (42) సాయికాలనీకి చెందిన మహిళ ఆర్.జ్యోతితో సహజీవనం చేస్తున్నారు. అయితే కొంతకాలంగా జ్యోతిపై అనుమానంతో రామకృష్ణారెడ్డి తరచూ గొడవ పడుతూ ఇబ్బందులు పెడుతున్నాడు. ఈ విషయాన్ని జ్యోతి తన అన్న బెంజిమెన్‌తో చెప్పడంతో రామకృష్ణారెడ్డిని హతమార్చేందుకు పథకం వేశారన్నారు. ఈనెల 5న మాట్లాడాలని రామకృష్ణారెడ్డిని పిలిచి రాత్రి 11గంటల సమయంలో సాయికాలనీ సమీపంలోని పొలాలకు తీసుకెళ్లి కర్రలతో తీవ్రంగా గాయపరిచారు. మృతిచెందాడని అనుకుని అక్కడి నుంచి ఇద్దరూ వెళ్లిపోయారు. అనంతరం గాయపడిన క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 16వ తేదీ రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా శనివారం జ్యోతి, బెంజిమెన్‌లను అరెస్ట్ చేశారు. అలానే హత్యకు ఉపయోగించిన కర్రలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు. దర్యాప్తులో కేసును ఛేదించిన సీఐ సోమశేఖర్, ఎస్సై పి.సురేష్, కానిస్టేబుల్ సుబ్బారావు, సిబ్బందిని డీఎస్పీ పి.శ్రీకాంత్ అభినందించారు.

ప్రసన్నాంజనేయస్వామికి అరటిపండ్ల పూజ



అద్దంకి రూరల్: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం అమావాస్య సందర్భంగా స్వామివారికి పదివేల అరటి పండ్లతో (దశసహస్ర కదళీఫలార్చన) పూజా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం స్వామివారి అభిషేకం అనంతరం వేదపండితులు, అర్చకులు, ఉభయదాతలు, భక్తులు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలుచేసి ధ్వజస్తంభానికి నారికేళసమర్పణ చేశారు.

26 నుంచి ప్లాస్టిక్ బ్యానర్లు నిషేధం

చీరాల అర్బన్: పట్టణంలో ఈనెల 26 నుంచి ఏ ఒక్కరూ ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్లను, మెటీరియల్స్ తయారు చేయడం గాని, దిగుమతి చేసుకున్నా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఏసయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనలు ఉల్లఘిస్తే జరిమానాతో పాటు షాప్‌ను సీజ్ చేస్తామన్నారు. ఫ్లెక్సీ ప్రింట్ చేసేవారు ప్లాస్టిక్ నిషేధిత అమలుకు సహకరించాలని ఆయన కోరారు.

గుండె జబ్బులపై అవగాహన

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గుండె జబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాబూరావు మాట్లాడుతూ ఎవరికైనా గుండె పోటుకు గురైనప్పుడు అంబులెన్స్ వచ్చేలోపు మనిషిని బతికించవచ్చన్నారు. అందుకు చేయాల్సిన ప్రథమ చికిత్స గురించి మనిషి బొమ్మ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సాల్మన్‌రాజు, క్లబ్ సభ్యులు కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.